కథానిక :

# కొత్త చిగురు

శ్రీ తల్లావజ్ఝల పతంజలి

"రండి త్వరగా, ఈ వేళ మీరు ఇల్లు వదిలి వచ్చే వ్యవహారం లాగ లేదు—అవతల ముహూర్తం దాటిపోతుంది."

ఒక అరవయ్యో పడి నిండిన వృద్ధకంఠంలో నుంచి వచ్చిన విసుగుతో కూడిన పిలుపది.

"ఏవిటండీ తొందర? వర్జ్యం వెళ్ళడానికే ఇంకా గంటన్నర ఉంటే, ఊరికే అరుచుకుంటూ రెందుకు?"

అశరీరవాణిలాలోపలి గదిలో నుంచి.

ఉదయం ఎనిమిది గంట లవుతుంది. సూర్య బింబం మేఘాల తెరల వెనక ఉండడం వల్ల వాతావరణం చల్లగానే ఉంది. చల్లటి గాలి వీస్తోంది—ఇంటి బయటి పెద్ద ఆవరణలో పచ్చగడి మీద వేసిన మంచం మీద ఆ ముసలాయన, ఒక యువకుడు కూచుని ఉన్నారు. కళ్ళు ఎటో చూస్తూండగా మనస్సు ఎటో పరుగులు తీయగా చేతిలో అప్రయత్నంగా కాలుతూన్న సిగరెట్టును తుదిసారిగా చవి చూసి ఉద్వాసన చెప్పాడతగాడు. ఎర్రటి అతని ముఖం మీద తమ ఉనికిని గట్టిగా తెలియ బరుస్తున్న స్మృతులు!—ఆ వృద్ధమూర్తి ముఖము మీద అనుభవము తాలూకు ముడుతలు ఎక్కువగా కనుపించవు. ఆరోగ్య కరమైన దేహ యష్టి.

అన్న కాలానికి కొద్దిగా ఆలస్యంగానే లోపలి నుంచి ఒక నడి వయసు దాటుతూన్న స్త్రీ మూర్తి, యౌవన మధ్య కాలములో పయనిస్తున్న ఒక కన్య, క్షమాపణలతో సహా ఆవరణలోకి అడుగు పెట్టారు. "అమ్మాయి

యువకుని వేపు చూసి ఆలస్యం అయింది'' అని మళ్లీ అంది. సమాధానం చెప్పలేదా యువకుడు. ఆవిడ చేతుల్లో సగం నిద్రా సగం మెలకువతో ఉన్న పసిపాపను చేతుల్లోకి తీసుకున్న దాకన్య;

నలుగురూ బయలుదేరారు.

సంభాషణ లేదు.

దరిదాపు ఆ ఊరు దాటి వచ్చారు. చిన్నపల్లె! క్రమంగా నీలపు మబ్బుల గుంపులు ఆకాశంలో సంఖ్యలో ఎక్కువై పోయాయి. నడుస్తున్న సన్నటి బాట ప్రక్కన దూర దూరంగా ఉన్న పున్నాగచెట్లమధుర వాసనలు అడపా దడపా వస్తున్నాయి. బాటలో మంచు బిందువులు కారుస్తున్న పున్నాగ పూవులు కాళ్ళ కింద చల్లగా నలిగిపోతున్నాయి. చల్లగాలిలో ప్రశాంతంగా ఎవరి ఆలోచనల్లో వారు నడుస్తున్నారు. యువకుడి పక్కనే అప్పుడప్పుడు కొద్దిగా ముందుకు తూలుతూ నడుస్తున్నదా అమ్మాయి. అతగాడు ఆలోచనను ఎటో తరుమగా ఆమె ఉనికికి ప్రాధాన్యము ఇవ్వ లేదు.

''పోనీ కాసేపు నేను ఎత్తుకోనా?''

ఉన్నట్టుండి అడిగాడతను, ఆమెను.

''అక్ఖర్లేదు బరువేముంది?''

అన్నదామె, ఒకసారి ఊపిరి తీసుకుని విప్పారిన కళ్ళతో అతన్ని చూసి.

ఈ రెండు మాటలూ ఆ నలుగురు ప్రయాణికుల ఆలోచనలను ఇహలోకపు సన్నటి కాలి బాట మీదకు మరలించాయి. ముసలాయన అన్నారు.

''ఎన్నాళ్ళకు, మాఘ మాసంలో అనుకున్నాను.''

''వాడో పట్టాన కదిలి వస్తేనా?''

ఆమె గారి ఫిర్యాదు—అతను అచలుడే.

కాలి బాట ఒక మామితోపులోకి దోవతీసింది. సందు తిరిగే సరికి ఎదురు గుండా కొద్ది దూరంలో కొబ్బరి మట్టలతో వికృతంగా కనబడు

తూన్న పెద్ద ఆశ్రమం కనిపించింది. నలుగురూ మనసులో ఒక మహా ప్రవాహాన్ని ఈది అవతలిదరి చేరినట్టుగా అయి కాలుసాగించారు,

అప్పటికింకా సూర్యుడు మబ్బు తెరల్లోంచి బయటకు రాలేదు. నీలి మేఘాలు నల్లవిగా రూపాంతరం చెందుతున్నాయి. ఆశ్రమ ప్రాంగణంలో నిష్ఠతో, ధ్యానంతో ఉన్న ఆవు, దూడ తప్ప మరేమీ లేవు. చూరుకిందకు చేరగానే చల్లగా-అనిపించింది.

ముందు ముసలాయన లోపలికి అడుగు పెట్టాడు. మిగతా ముగ్గురూ బయటనే నిలుచున్నారు. నిముషమైన తరువాత మళ్ళీ నలుగురూ ఆశ్రమంలోకి బయలు దేరారు. చిన్న చాప మీద, ముందు అగరు ధూపం ఆశ్రమ వాటికంతా కమ్మటి వాసనలతో ముంచేస్తూండగా, అర్ధనిమీలిత నేత్రాలతో ఫాలభాగం మీద విభూతిరేఖలు మెరిసిపోతూండగా ఆసీనులై ఉన్నారు స్వామి చిరుత వయస్సులోనే పరలోక చింతన మారంభమైనదేమో ఆయన వయస్సు దరిదాపు త్రిదశ వర్షాలకు కొద్దిగా పైనే తప్ప ఉండదు.

చిరునవ్వు నవ్వుతూ, అందుకున్న సమస్కృతుల తర్వాత చేయెత్తి ఆశీర్వదించారు.

"చిరంజీవి పేరేమన్నారు?

"..........................."

"ఏదీ, చేతిలో వేసుకుని చూపమ్మా"

ఆ యువకుడు సహాయం చెయ్యగా ఆ కన్య ఒడిలో పిల్లవాడిని వేసుకుని ముందుకి బాగా కనబడేటట్టు కూచున్నది.

ఆయన కనులు విప్పారినవి!

కళ్ళల్లో ఏదో మెరుపు కొట్టుకుని వచ్చి నట్టయింది. అలాగే తదేక ధ్యానంతో పసికందును చూస్తూ ఉండిపోయారాయన.

గులాబీరేకుల ఎరుపునం పుణికి పుచ్చుకున్న నున్నటి చెక్కిళ్లు, లేత ఎరుపుగంగు పెదవుల మీద అకారణంగా తరచుగా నృత్యం చేసే చిరు

నవ్వు—తర్వాతా చెక్కిటి మీద స్పష్ట—మృదువైన అతగాడి దేహ—ముగ్ధు లయి పోయారు స్వామీజీ.

వణుకుతున్న తర్జనితో పసివాని మృదువైన బుగ్గల మీద సున్నితంగా కొట్టి, చిరునవ్వు చిందించారాయన.

ఎందుకో ఆ యువతీ యువకుల ముఖాలు ఆనందంతో మెరిసాయి. ఒకరివైపొకరు అప్రయత్నంగా చూసుకున్నారు.

అయిదు నిముషాలు గడిచిన తర్వాత—తన్మయత్వంలోంచి తేరుకుని ఆ పసికందును తన చేతుల్లోకి తీసుకున్నారు స్వామీజీ. శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది. ఖాళీగా, ఎండిపోయిన హృదయ పాత్రికనిండా మధువు చిలకరించినట్టు అయి పసివాడి బుగ్గల మీద మృదువుగా ముద్దిడుకొన్నా రాయన.

అలవాటు లేని ఆయన ఎత్తుకోడం లోని అసౌకర్యాన్ని మరుక్షణం లోనే గుర్తించి—బిక్క మొగం వేశాడు పసివాడు. పసివాణ్ణి మళ్ళీ ఆమె కందించి ఎదురు గుండా ఉన్న కంచు శివుని విగ్రహానికి నమస్కరించి కళ్లు మూసుకుని-చిత్తం ఎటో పరుగులు తీయగా-ధ్యానంలో లీనం కావడానికి యత్నించారాయన.

కళ్లు తెరచి-ఇంత విభూతి—చిటికెడు తీసికొని కుర్రవాడి లలాటం మీద పూశారు స్వామీజీ, విభూతి తాలూకు రేణువులు కళ్ళల్లో పడి ఒక క్షణం పసివాడి కళ్లు అయోమయంలో రెప రెప లాడాయి.

ముసలాయన సాష్టాంగ పడి స్వామీజీకి నమస్కరించాడు, ఈ యువ దంపతులు కూడా సమిష్టిగా-నమస్కరించి ఆశీర్వచనం అందుకొన్నారు.

క్షేమ సమాచారం, నివాస స్థలం అడిగి తెలుసుకున్న తరువాత—ఆ యువకుని ఉద్యోగ విషయం కూడా చెప్పాడా ముసలాయన—సంవత్సరం క్రితం కలిగిన ఆ పసికందును స్వామి వారి ఆశీర్వచనం కోసం తీసుకురావడం—ఆలస్యం-తాము అక్కడే స్థిరపడ్డం-అన్నీ ఆయనకు మనవి చేశాడు—

స్వామీజీ విస్ఫారిత నయనాలు మాత్రం తరుచుగా ఆ పసివాడి మీదకు మళ్ళుతున్నాయి. మళ్ళీ అతగాడ్ని తన ఒడిలోకి తీసుకుని బుగ్గల మీద మృదువుగా రాస్తూ ఉండిపోయి—ముసలివ్యక్తి చెప్పే గృహ విషయాలు అన్య మనస్కంగా వింటున్నారు.

ఆ పసివాడి మృదుశరీర స్పర్శ తనలో ఏవో శీతల ఝరీప్రవాహాలు ప్రవహించి నట్టుగా ఉంది. శరీరం యావత్తూ వింత కదలికతో తన స్వాధీనం తప్పుతోంది. ఎక్కడో, ఎప్పుడో పారవేసుకున్న అమూల్య వస్తువు పునః తన చేతికి దొరికినట్టుగా మాటిమాటికి ఆయన తన హృదయానికి హత్తుకొన సాగాడు—ప్రతి స్పర్శా-ప్రతి చుంబనం ఆయనలో వింత పరివర్తనం కలిగిస్తున్నది. కంఠం ఎందుకో గాద్గదికత వహించింది. ఒక్కసారిగా ఆయన మనస్సులో ఎన్నడో వదిలి వేసినవన్నిటి స్వరూపం-తన పసివాడి అస్పష్ట రూపం మెదిలాయి. ఆధ్యాత్మిక ఆనందంలో, భగవన్నామ స్మరణతో తను ఇన్ని సంవత్సరాలు గడిపాడు. అబ్బ! తను ఇన్నాళ్ళుగా భగవద్ధ్యానంలో పొందని అపూర్వమైన ఆనందం-ఏదో బలమైన శక్తి పసివాడి వేపు లాగుతున్నాయి, ఐహిక సుఖాలను వదిలి, ఇంద్రియాలను జయించారాయన—కానీ............

*　　　*　　　*　　　*

తీరికగా భోజనాలు కానిచ్చి, ఆ మంద వాతావరణంతో ఆరుబయట మామిడిచెట్టు కింద మంచం వేసుకుని నిద్రతీస్తున్నాడు ముసలాయన-లోపల ఏదో పనిలో ఉండి—అప్పుడే తెరిపి చేసుకుని వచ్చి నిద్రలో ఉన్న ఆయన్ను విసుక్కుంటూ-ఆక్కన్నుంచే మేలుకొలుపు మాటలతో సమీపించిందామె.

"మొత్తానికి అంత గడబిడ చేశారు-ఆయన మాత్రం అయిదు నిముషాల్లో మంత్రం వేసె. మీరే అన్ని హడావిడులూనూ."

విధిలేక లేచిన ముసలాయన మీద నిష్ఠూరంగా వేసిన ప్రథమబాణం.

"అపునే వారి ధ్యాన సమయంలో వెళ్ళి నెత్తి మీద కూచుంటామా కాస్త తొందరగా వెడితే పాపం ఏమీ కాదుగా—"

"అది సరేగానండీ, సన్యాసి అయితే మట్టుకేం బుజ్జిగాడ్ని చూసి ఎంత మురిసి పోయాడండీ,"

"అవునే మరీ, సన్యాసి వాడికి మమకారాలు ఉండవని నేను నమ్మను ఆయనగారు ఏ పసివాణ్ని వదిలి ఈ ఆశ్రమం చేరాడో"

ఏదో పిచ్చాపాటీ-టప టప స్వచ్ఛమైన వర్ష బిందువులు మీద పడగానే తలెత్తి చూచి వర్షాగమనం గుర్తించి-లోనికి పయనం సాగించారు.

* * * *

వర్షం వస్తున్న దన్నసూచనగా చల్లటిగాలి తిరిగింది. సాయంత్రం ఆరుగంటలు అయి ఉంటుంది. నల్లటి మేఘాల చాందినీ క్రింద తెల్లటి కొంగల బారులు హుటా హుటిగా శాంతి సందేశం లాగ గాలిలో తేలిపోయా ఎగురుతున్నాయి.

స్నానం కానిచ్చి-భగవద్ధ్యానం పూర్తి చేసి-శాంతంగా ఆశ్రమం ముందు భాగంలో ఉన్న చిన్న అరుగు మీద కూచున్నారు స్వామీజీ—ఉదయం పసివాడి స్పర్శ వల్ల గలిగిన అనుభూతు లాయన హృదయంలో ఇంకా పదిలంగా ఉన్నాయి. ప్రశాంతంగా ఉన్న ఆయన మనసును-మళ్ళీ బయటికి వచ్చి ఆక్రమించాయి ఎన్నో ఆలోచనలు. పసివాడి రూపు హృదయంలో ముద్ర వేసుకుని పోయింది.

పరధ్యానంలో కాలం పరుగెత్తిపోతూ, తనతో బాటు కురవబోయే వర్షాన్ని గూడా కురవకుండా కొనిపోయింది.

నలుదెసలా బాగా చీకట్లు అలుముకున్నాయి. నక్షత్రాల ఉనికి లేదు ఆకాశంలో. అస్పష్టంగా కదులుతూన్న మేఘ పుంజాలు మాత్రం గట్టిగా చూస్తే కనబడుతున్నాయి. ఎదురుగా, నల్లగా మావితోపు-కీచురాళ్ళ గొంతు చించుకోవడం స్పష్టంగా వినబడుతోంది.

ఏదో స్థిర నిశ్చయానికి వచ్చిం దాయన మనసు, ఆ ఆలోచనకు గుండె వేగంగా కొట్టుకో నారంభించింది. వెళ్లాలి—చూడాలి. గుండెకు అదుముకుని కన్నీళ్లు పసివాడి చెక్కిళ్ళు తడిసిపోయేలాగ-తనకు తెలియకుండా గుండెల్లో పేరుకున్న దుఃఖపు తెరల్ని చీల్చివెయ్యాలి. పసివాడి చెక్కిళ్లు ఎంత మృదువుగా ఉంటాయి? స్పర్శ మాత్రం చేత ఎందుకో అంత ఆకర్షణ! బోసినవ్వు!

ఎంత అమాయకత్వం—గుండె వేగం అధిగమించింది—తనలో ఇన్నాళ్లు ఎంత కాఠిన్యం పేరుకొంది!

.......................................

ఆరుబయట వృద్ధ దంపతులు నిద్రలో ఉన్నారు. ఓరవాకిలిగా వేసున్న తలుపులు గాలి తాకిడికి అప్పుడప్పుడూ ఊగుతున్నాయి. లోపల, దంపతులు మూగ ఆనందంతో—చెప్పుకోలేని ప్రేమానురాగాలను పరస్పరం అందించుకున్న తరువాత-సడలిన పరిష్వంగంలో-అంతు తెలియని లోకాల్లో విహరిస్తున్నారు.

ఊయలలో పసివాడు మంచుబిందువులాటి నిర్మలమైన మనస్సుతో-తీయటి—తనకు తెలియని కలల్లో తేలుతూ సుషుప్తిలో ఉన్నాడు.

చటుక్కున సగం నిద్రలో ఏదో చప్పుడయి జాగ్రదవస్థలోకి వచ్చిందామె. చీకటిలో శబ్దంతప్ప వినిపించడం లేదు-భయంతో ఆమె కంపించి పోయింది.

ఏదో శబ్దం వినిపిస్తున్న దామెకు!

సంభ్రమాశ్చర్యాలతో అలాగే కట్టె వలె మంచం మీద కూచుండి పోయింది.

బయట ఎక్కడో మెరపు మెరిసింది?

చూసి, ఆమె దిగ్భ్రమతో నోరు తెరుచుకుని చూస్తూ అచేతన అయి పోయింది.

నిద్రిస్తున్న పసికందును—చేతుల్లోకి తీసుకుని ముద్దులతో ముంచెత్తుతూ ఏక ధారగా ప్రవహిస్తున్న కన్నీళ్ళతో, దాచి పెట్టిన వేదనంతా వెడల గక్కుతున్నారు, స్వామీజీ!